చదువుపై ఆసక్తి పెంచాలి


ఉద్దీపనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, అధికారులు

ఇల్లెందురూరల్: ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. మండలంలోని రాఘవాపురం (కోటన్ననగర్) గ్రామ గిరిజన ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉద్దీపనం పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో భాగంగానే విద్యాశాఖ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ కోసం ప్రతీ మండలానికి ఎంఈఓలను నియమించిందని, పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటోందని చెప్పారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉండాలన్న లక్ష్యంతో ఉపాధ్యాయుల నియామకం చేపట్టిందన్నారు. రానున్న రోజుల్లో మరోసారి డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడటంతోపాటు వారికి మెరుగైన విద్యాబోధన చేపట్టి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఐటీడీఏ రూపొందించిన ఉద్దీపనం పుస్తకం ప్రాథమిక దశలో ప్రతిభను పెంచుకునేందుకు ఉపయోగపడుతుందని, సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ మణెమ్మ, ఏటీడీఓ సూర్యపాక రాధ, హెచ్ఎం పద్మ, బాలు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్‌సీఆర్పీలు, మాజీ సర్పంచ్ చింత రజిత, మాజీ వైస్ఎంపీపీ మండల రాము తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయండి


ఇల్లెందు: మాట్లాడుతున్న దిండిగల రాజేందర్

ఇల్లెందు: తెలంగాణ మలి దశ ఉద్యమం ఉవ్వెత్తున లేచి మలుపు తిప్పిన ఉద్యమ చరిత్రపై చెరిగిపోని సంతకం చేసిన మహా నాయకుడు కేసీఆర్ చేపట్టిన నవంబర్ 29ని దీక్షా దివస్‌గా పాటించాలని బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు దిండిగల రాజేందర్ కోరారు. గురువారం ఇల్లెందులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ నిరాహార దీక్ష చేపట్టిన రోజును మరోమారు గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు కొత్తగూడెం జిల్లా కార్యాలయం తెలంగాణ భవన్‌లో జరగనున్న దీక్షా - దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిలివేరు సత్యనారాయణ, లకావత్ దేవీలాల్ నాయక్, శీలం రమేష్, జాఫర్ హుస్సేన్, అజ్మీరా భావ్‌సింగ్ నాయక్, దేరంగుల పోషం, అబ్దుల్ నబీ, జబ్బార్, గిన్నారపు రాజేష్, సాతల్ల హరికృష్ణ, రాచపల్లి శ్రీను, లలిత్‌కుమార్ పాసీ, పాలడుగు రాజశేఖర్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: 29వ తేదీ శుక్రవారం కొత్తగూడెం బీఆర్ఎస్ కార్యాలయంలో జరగనున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు పిలుపునిచ్చారు. గురువారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

క్లుప్తంగా

పోలీస్ స్టేషన్ తనిఖీ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో గురువారం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు వాటి పురోగతి, క్రైం రేటు వంటి విషయాలను సీఐ కరుణాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వనసమారాధన

జూలూరుపాడు: గుండెపుడి గ్రామంలో గురువారం బీసీ కులస్తుల వనసమారాధన ఘనంగా జరిగింది. గ్రామానికి సమీపంలోని మామిడితోటకు తరలివచ్చి ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అదేవిధంగా ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అనంతరం బీసీ కులస్తులందరూ సామూహికంగా వనభోజనాలు చేశారు. కాళ్లూరు వెంకటేశ్వరరావు, కొమ్మినేని కృష్ణమూర్తి, పాండురంగారావు, యల్లంకి రవికుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో గోగులు సత్యనారాయణ, మద్దెబోయిన పిచ్చారావు, వేల్పుల గోపాలకృష్ణ, శివరామకృష్ణ, మద్దెబోయిన వెంకటేశ్వర్లు, నాగరాజు, ఆనగంటి ధనమయ్య, దొప్పా సత్యనారాయణ, సంతోష్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం..


కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

టేకులపల్లి: సమాజంలో బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ (ఎయిడ్) ఇన్‌చార్జ్ తేజావత్ మాన్‌సింగ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం రాత్రి స్థానిక యువకులతో కలిసి మండల కేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాలు, బాలికలు, మహిళల అక్రమ రవాణాలను అరికట్టేందుకు తమ ఎయిడ్ సంస్థ కృషి చేస్తుందన్నారు. బాల్య వివాహ రహిత భారతదేశం కోసం అందరూ కృషి చేయాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లయితే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు లేదా డయల్ 100కు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు.

రమేష్‌ను కోర్టులో హాజరు పర్చండి..

టేకులపల్లి: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి పూనెం రమేష్ అరెస్టు అప్రజాస్వామికమని న్యూడెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు, ఇఫ్టూ రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పేద ప్రజల కోసం, వారి హక్కుల పరిరక్షణ కోసం పార్టీ పనిచేస్తుందని ఈ క్రమంలో పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం శోచనీయమన్నారు. ప్రజలలో తలలో నాలుకలా పనిచేస్తున్న రమేష్‌ను కొంతకాలంగా వెంటాడుతూ గురువారం అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండించారు. రమేష్‌కు హాని తలపెట్టకుండా వెంటనే కోర్టులో హాజరు పర్చాలని డిమాండ్ చేశారు.

జీఓ 22 ప్రకారం వేతనాలు చెల్లించండి..

ఇల్లెందు: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు జీఓ 22 ప్రకారం వేతనాలు విడుదల చేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఇల్లెందు బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. చట్టబద్ధంగా జేబీసీతో జరిగిన ఒప్పందం ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరారు. నేటి వరకు లాభాల వాటా అందని కాంట్రాక్ట్ కార్మికులకు తక్షణమే రూ.5 వేలు చెల్లించాలని పేర్కొన్నారు. కొన్నిసార్లు 10 నుంచి 20 తేదీ వరకు కూడా కార్మికులకు వేతనాలు చెల్లించటం లేదని వాపోయారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, సింగరేణి వివిధ ఏరియాలలో ఖాళీగా ఉన్న సింగరేణి క్వార్టర్లను ఆయా ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలని పీఎస్‌టీయూసీఐ రీజియన్ అధ్యక్షుడు పెద్దబోయిన సతీష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం కొత్తగూడెం కార్పొరేట్, బాబుక్యాంపు, రైటర్ బస్తీ తదితర డిపార్ట్‌మెంట్‌లలో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. సింగరేణిలో సుమారు 20 సంవత్సరాలకు పైగా 30 వేల మంది వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్నారని వీరికి కనీస వేతనాలు అందటం లేదన్నారు. వేతనాలు పెంచటంలో గత ప్రభుత్వం మొండిగా వ్యవహరించిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా చొరవ చూపటం లేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం జీఓ 22 ప్రకారం వేతనాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

ధాన్యం అమ్ముకుని బోనస్ పొందండి..


ధాన్యాన్ని పరిశీలిస్తున్న వీరహనుమంతరావు

చుంచుపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం ఇచ్చే బోనస్‌ను పొందాలని కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు అన్నారు. చుంచుపల్లి మండలంలోని రాంపురం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి బోనస్ చెల్లిస్తుందని, బోనస్ పొందాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉంచామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలన్నారు. చుంచుపల్లి ఏఓ రాజేశ్వరి, మానిటరింగ్ ఆఫీసర్ జయశ్రీ, సంఘం సెక్రటరి పండ్ల సారయ్య, రైతులు నాగరాజు, పులిచర్ల విశ్వనాథం, కట్ట బుచ్చయ్య పాల్గొన్నారు.

నేడు 'తమ్మినేని' రాక


సుజాతనగర్: వేపలగడ్డ గ్రామంలో శుక్రవారం జరగనున్న సీపీఎం మండల మూడో మహాసభకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు మండల కార్యదర్శి వీర్ల రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ కూలీలకు భారంగా మారిన సుజాతనగర్ కార్పొరేషన్‌ను విరమించుకోవాలని, అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలనే తదితర సమస్యలను బహిరంగ సభలో చర్చిస్తారని, వేలాదిగా హాజరై మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

మాలల సింహగర్జన సభ పోస్టర్లు ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: డిసెంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని మలమహానాడు డివిజన్ అధ్యక్షుడు కాలే పుల్లయ్య పిలుపునిచ్చారు. మామిడిగూడెం గ్రామంలో గురువారం సింహగర్జన సభ ప్రచార పోస్టర్లను స్థానికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలందరూ ఐక్యత చూపాలని కోరారు. కార్యక్రమంలో దాసరి స్వామిదాసు, సృజన్‌కుమార్, కొరివి సుబాష్టీన్, రవికుమార్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడికి నివాళి


ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

జూలూరుపాడు: సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మృతికి సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. గురువారం జూలూరుపాడులో సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్ చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో చంద్ర నరేంద్ర కుమార్, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కే నాగుల్‌మీరా, ఎస్కే చాంద్‌పాషా, యల్లంకి మధు, నిమ్మటూరి లచ్చయ్య, సామేలు, శివకృష్ణ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సీనియారిటీ ప్రకారం బదిలీలు చేపట్టాలి


సీఈ ప్రభాకర్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: థర్మల్ స్టేషన్‌లలో పనిచేసే ఇంజనీర్లకు సీనియారిటీ ప్రకారమే విద్యుత్ సౌధకు బదిలీలు చేయాలని, ఇప్పటి వరకు ఇచ్చిన బదిలీలను రద్దు చేయాలని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్, ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. గురువారం స్థానిక కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారంలో సీఈ ఎం.ప్రభాకర్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..

త్వరలో 339 మంది ఏఈలుగా పోస్టింగ్‌లు ఇచ్చే ముందు ఎనిమిది సంవత్సరాలుగా పనిచేస్తున్న ఇంజనీర్లకు బదిలీలు ఇవ్వాలన్నారు. రామగుండం థర్మల్ స్టేషన్‌ను జెన్‌కో పరిధిలోనే ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ల బ్రాంచ్ సెక్రటరీలు డి.ఉమామహేశ్వరరావు, కె.అఖిలేష్‌రెడ్డి, చంద్రకళాధర్, కీర్తి, ప్రదీప్, దివాకర్, శ్రీపాల్, రామారావు, రజిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత


క్రీడా సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి 9వ వార్డులోని రామవరం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ మిలీనియం కొత్తగూడెం వారు రూ.10 వేల విలువ చేసే క్రీడా సామగ్రిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభుదయాళ్‌కు బహూకరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు సత్రు మాట్లాడుతూ... 1990లో టేకులపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రభుదయాళ్ నేర్పిన విద్యాబుద్ధులు, క్రమశిక్షణ, విలువలతో నేడు తాను ఈ స్థాయికి చేరానన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధించవచ్చన్నారు. నేటి ఉపాధ్యాయులు నేర్పే ఈ పాఠాల ద్వారా మీరు భవిష్యత్‌లో ఒక ఇంజనీరు, డాక్టర్, లాయర్, ఒక ప్రభుత్వ అధికారిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సత్యనారాయణ, కోటేశ్వరరావు, పిచ్చయ్య, జేబీ మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల సందర్శన


జూలూరుపాడులో కేజీబీవీ విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

జూలూరుపాడు: మండల కేంద్రంలోని కేజీబీవీ, పాపకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను గురువారం మండల విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్, సివిల్ సప్లై ఆర్ఐ ఎన్.వెంకటేశ్వరరావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు మిడ్ డే మీల్స్, స్టోర్ రూమ్‌లోని బియ్యం, సరుకులతోపాటు, రికార్డులను పరిశీలించారు. భోజనం నాణ్యత, పరిశుభ్రత, రుచిని చూశారు. కేజీబీవీ విద్యార్థినులతో కలిసి అధికారులు భోజనం చేశారు. అనంతరం ఎంఈఓ జుంకీలాల్ మాట్లాడుతూ... విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో జూలూరుపాడు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, కేజీబీవీ ఎస్ఓ పద్మజ, పాపకొల్లు హైస్కూల్ హెచ్ఎం ఎస్కే మీరాసాహెబ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోయగూడెం ఓసీ ఇల్లెందుకే తలమానికం

టేకులపల్లి: సింగరేణి కాలరీస్ ఇల్లెందు ఏరియాకే కోయగూడెం ఓపెన్‌కాస్టు తలమానికమని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. ఈ మేరకు గురువారం టేకులపల్లి సీఈఆర్ క్లబ్‌లో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం, విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోయగూడెం ఉపరితల గని ఉద్యోగులు రక్షణ సూత్రాలను పాటిస్తూ సంస్థ నిర్దేశించిన లక్ష్యాన్ని గడువుకు ముందే చేరుకోవడంతో సంస్థలో వారు ప్రత్యేక స్థానం సంపాదించుకున్నట్లు చెప్పారు. ఇటు రక్షణలోనే కాకుండా పర్యావరణ అంశాలపై ఎన్నో అవార్డులను అందుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఇల్లెందు ఏరియాకు కోయగూడెం ఉపరితల గని ఒక తలమానికంగా ఉందని పేర్కొన్నారు. తాను 41 ఏళ్ల క్రితం సింగరేణి ఉద్యోగ ప్రస్థానాన్ని ఇల్లెందులోనే ప్రారంభించానని, ఇక్కడే ఈనెల 30న ఉద్యోగ విరమణ చేస్తుండటం సంతోషకరమన్నారు. 17 నెలల క్రితం ఇల్లెందు ఏరియా జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకతలతో పాటు కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. తాను జీఎంగా ఎన్నో అభివృద్ధి పనులు చేశానని అందులో భాగంగా టేకులపల్లిలోని సీఈఆర్ క్లబ్, పార్క్, షటిల్ కోర్టులను ఆధునీకరించడం జరిగిందని తెలిపారు. సమాజంలో జరిగే ప్రతీ విషయాన్ని మీడియా ప్రపంచానికి తెలియజేస్తుందని, ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిగా మీడియా చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. అనంతరం జీఎం ఆనంద్‌ని టేకులపల్లి ప్రెస్‌క్లబ్ తరఫున శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, మేనేజర్ సౌరబ్ సుమన్, ప్రాజెక్టు ఇంజనీర్ శివ శంకర్, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షులు రాజారామ్, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు, ప్రాతినిధ్య సంఘ బ్రాంచ్ కార్యదర్శి భూక్యా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


జీఎం జాన్ ఆనంద్‌ను సన్మానిస్తున్న జర్నలిస్టులు

రేపు ప్రభుత్వ పాఠశాలల బంద్

ఇల్లెందు: ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల బంద్ పాటించాలని పిలుపునిచ్చినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బయ్యా అభిమన్యు తెలిపారు. గురువారం ఇల్లెందులో ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుదారు. ప్రభుత్వ హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించటం లేదన్నారు. విద్యార్థులు చనిపోతున్నా అధికారులు చర్యలు తీసుకోవటం లేదని ఆరోపించారు. పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, వసతి గృహాలు, గురుకులాలు సమస్యలతో సతమతం అవుతున్నా రక్షణ కరువైందన్నారు. రాష్ట్రంలో విద్యారంగానికి మంత్రి పదవి లేకుండా పాలన సాగుతోందని, విద్యారంగ సమస్యలపై ఏడాదిగా ఎటువంటి సమీక్షలు జరుగటం లేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరశిస్తూ ఈ నెల 30న రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలు బంద్ పాటించి నిరసన వ్యక్తం చేయాలని ఎస్ఎఫ్ఐ నిర్ణయించినట్లు చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాలయాలు బంద్ పాటించాలని కోరారు.

ప్లాస్టిక్ వాడకంతో ప్రమాదం


మాట్లాడుతున్న చైర్మన్ వెంకటేశ్వరరావు


హాజరైన వ్యాపారులు

ఇల్లెందు: మానవాళి జీవనానికి ప్లాస్టిక్ పెను ప్రమాదం అని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఇల్లెందులోని మున్సిపల్ కార్యాలయంలో పట్టణ వ్యాపారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ మాట్లాడుతూ... ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు పట్టణమంతా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ చైతన్యం నింపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ, ఎన్విరాన్‌మెంట్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించండి..


పాల్వంచ: పూలేకు నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

పాల్వంచ: బీసీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని జెన్‌కో బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొరమవెల్లి రవీందర్ అన్నారు. గురువారం జ్యోతిరావు పూలే వర్ధంతి పురస్కరించుకుని కేటీపీఎస్ బీసీ అసోసియేషన్ హాల్‌లో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. వెనకబడిన వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో దొంతరబోయిన హరికృష్ణ, లింగం వినోద్ బాబు, వెంకటేశ్వర్లు, నరేందర్, సతీష్, కె.సాంబయ్య, నాగేశ్వరరావు, మహేందర్, కుమార్, శ్రీను, రామారావు, అనిల్ పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులు


కొత్తగూడెంరూరల్: విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్


టేకులపల్లి: బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి చెక్‌ముకి పోటీల్లో త్రివేణి స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, స్కూల్ డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరిలు గురువారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు.

టేకులపల్లి: జిల్లా కేంద్రం కొత్తగూడెంలో నిర్వహించిన చెకుముకు జిల్లా స్థాయి టాలెంట్ టెస్టులో టేకులపల్లి మండలం విద్యార్థులు ప్రతిభ చాటారు. టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.గీత, వి.శ్రీహరిణి, ఎస్.హర్షిత జిల్లా స్థాయి ప్రథమ బహుమతి సాధించారు. వీరికి గైడ్ టీచర్‌గా ఎం.మోహన్‌రావు వ్యవహరించారు. వీరిని హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

సామాజిక చైతన్య సారథి పూలే


కొత్తగూడెంఅర్బన్: నినాదాలు చేస్తున్న బీఎస్పీ నాయకులు


ఇల్లెందురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కొత్తగూడెంఅర్బన్: ఆదర్శప్రాయులు పూలే అని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ అన్నారు. గురువారం బీఎస్పీ జిల్లా కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతిని జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జునరావు అధ్యక్షతన నిర్వహించారు. కామేష్ హాజరై పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిరావు పూలే సంఘ సంస్కర్త అని, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసినట్లు తెలిపారు. దిగువ కులాల ప్రజలు సమాన హక్కులు పొందేందుకు సత్యశోధక్ సమాజ్‌ను ఏర్పాటు చేసి అణగారిన వర్గాల అభ్యున్నతికి పనిచేసే ఈ సంఘంలో అన్ని మతాల, కులాల ప్రజలను చేర్చారని, విద్య ప్రాముఖ్యతను గుర్తించి, భార్య సావిత్రిబాయి పూలేకు విద్యను బోధించి ఇద్దరూ కలిసి మహిళలకు, తక్కువ కులాల ప్రజలకు విద్యను అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాలోతు వీరునాయక్, సాయి, జెట్టి ఆనందరావు, బంటు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహాత్మ జ్యోతిరావు పూలే 134వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. కళాశాల ఆవరణలో పూలే చిత్రపటానికి ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య, అధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నప్పయ్య మాట్లాడుతూ.. ఆధునిక భారతదేశ చరిత్రలో నిచ్చెన మెట్ల వర్ణ వ్యవస్థలో ఉన్న సామాజిక చైతన్యానికి, నిమ్న వర్గాల అభివృద్ధికి, సమాజం చేత పీడించబడిన అణగారిన వర్గాల పక్షాన, అగ్రవర్ణ కుటుంబ వ్యవస్థలో ఉన్న కట్టుబాట్లను ఛేదించిన సామాజిక చైతన్య సారథి, స్త్రీ విద్య కోసం, మహిళా సాధికారత కోసం జీవిత కాలం పోరాటం చేసిన మహనీయుడు జ్యోతీరావు పూలే అని కొనియాడారు.

కార్యక్రమంలో అధ్యాపకులు జి.శేఖర్, ప్రభాకర్‌రావు, డాక్టర్ శ్రీదేవి, కృష్ణవేణి, డాక్టర్ నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, రాజు, సరిత, సురేంద్రకుమార్, శ్రీకాంత్, లక్ష్మణ్‌రావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.